



PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక: 50 ఎడిటర్: రాపోలు లింగస్వామి 20 -10-2026 మంగళవారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00








# సరస్ మేళా'లో రికార్డు స్థాయి వ్యాపారం..

హైదరాబాద్, అక్టోబర్ 19: నగరంలో ఏర్పాటు చేసిన 'సరస్ మేళా'కు భారీ స్పందన లభించింది. అక్టోబర్ 7 నుంచి అక్టోబర్ 18 వరకు కొనసాగిన ఈ మేళాను సుమారు 5.98 లక్షల మంది సందర్శించారు. రికార్డు స్థాయిలో రూ. 9.29 కోట్ల అమ్మకాలు నమోదు కాగా.. మహిళా సంఘాలకు భారీగా ఆదాయం లభించినట్లు అధికారులు వెల్లడించారు. చివరి నాలుగు రోజుల్లోనే రోజుకు కోటి రూపాయలకు పైగా వ్యాపారం జరిగిందని తెలిపారు. ఈ మేరకు మంత్రి సీతక్క మహిళా సంఘ సభ్యులకు, అధికారులకు అభినందనలు తెలిపారు.కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, తెలంగాణ ప్రభుత్వం(సెర్ప్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'సరస్ మేళా'కు భారీ స్పందన లభించిందని అధికారులు వెల్లడించారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెట్ కల్పిస్తూ.. మహిళా సాధికారతకు తోడ్పడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయాల కోసం 225 స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ ఏడాది ఏర్పాటు చేసిన మేళాలో కనీవినీ ఎరుగని రీతిలో అమ్మకాలు జరిగాయని.. మహిళా సంఘాలకు భారీగా ఆదాయం లభించిందన్నారు. 2025లో రూ. 3.28 కోట్ల అమ్మకాలు నమోదు కాగా.. ఈ ఏడాది రూ. 9.29 కోట్లకు వ్యాపారం చేరుకుందని వెల్లడించారు. ఈ మేరకు మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విశేషంగా ఆదరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



# సంపాదకీయం

## దేశ సమస్యలకు కారణం ఉద్యోగులా?

ఎన్‌పీఎస్ (నూతన జాతీయ పెన్షన్ విధానం) ప్రపంచ బ్యాంకు రచించిన పెన్షన్ సంస్కరణల్లో భాగంగా వచ్చిన పథకం. దీన్ని భుజాన వేసుకుని మోయడానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ 9-10-2026 నాటి ఆంధ్రజ్యోతి పత్రికలో శాయశక్తులా ప్రయత్నం చేశారు. అందులో భాగంగా పరిపాలన, విద్యారంగం వంటి అంశాలను కూడా చర్చించారు. కానీ ఎన్‌పీఎస్ ద్వారా ఉద్యోగులకు వచ్చే లాభమేందో చెప్పలేదు. ఓపీఎస్ పునరుద్ధరించాలన్న డిమాండ్ మొత్తం సమాజ సమస్యగా చిత్రీకరించడానికి తీవ్రంగా ప్రయత్నించారు. విషయాన్ని పక్కదారి పట్టించడానికి కృషి చేసినట్టు తెలుస్తున్నది. ఉద్యోగ విరమణ తర్వాత చెల్లించాల్సిన ప్రయోజనాలకు, ఓపీఎస్ అమలు చేయాలనే డిమాండ్‌కు, ప్రజా సమస్యలకు సంబంధమేందో జేపీకే తెలియాలి.

2014లో రాష్ట్ర విభజన జరిగినప్పుడు దేశంలోనే అత్యంత మిగులుఉన్న రాష్ట్రంతెలంగాణఅని జేపీతన వ్యాసంలో పేర్కొన్నారు. ఈ పదేండ్ల కాలంలో ప్రభుత్వం ఖర్చులకు కూడా కష్టపడుతున్నది అని చెప్పుకొచ్చారు. ఆయన వాదన ప్రకారం 2004లోనే ఓపీఎస్ అమలు చేసిన తర్వాత ప్రభుత్వ పరిస్థితి మరింత మెరుగ్గా మారాలి కదా! ఆర్థిక పరిస్థితి ఎందుకు దిగజారింది? పైగా ఖర్చులకు వెతుక్కోవాల్సినటువంటి పరిస్థితి రావడానికి ఉద్యోగులే కారణమనే విధంగా రాశారు. ఈ 12 ఏండ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థతో సంబంధం లేకుండా దుబారా చేసిన విషయం, అనుత్పాదక వ్యయాలు, వ్యవస్థలోని అవినీతి వల్ల ప్రజాధనంపై ఎంత ప్రభావం పడుతున్నదనే విషయం జేపీ చెప్పలేదు. ఉద్యోగులు కనీస ప్రమాణాలతో కూడిన జీవితాన్ని గడపడానికి కావలసిన వేతనాలు అందించాలని అంతర్జాతీయ కార్మిక సంస్థ, యునెస్కో లాంటి సంస్థల సిఫారసులకు అనుగుణంగా వేతనాలు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. ఆ విషయాన్ని విస్మరించి సమస్త ఆర్థిక ఇబ్బందులకు ఉద్యోగుల కోరికలే కారణమన్నట్టుగా జేపీ వాదించారు. ఎన్‌పీఎస్ ద్వారా సీపీఎస్‌లో పెట్టుబడి పెట్టిన డబ్బు ఎక్కడికీ పోదని, ఉద్యోగి చనిపోతే కుటుంబ సభ్యులకు వెళ్తుందని అన్నారు. కానీ రిటైరైన ఎన్‌పీఎస్ ఉద్యోగుల పరిస్థితి భిన్నంగా ఉన్నది. వారికి రూ.1,000-రూ.1,500 మాత్రమే పెన్షన్‌గా వస్తున్నది.

ప్రైవేట్ పెట్టుబడిదారుల ద్వారా షేర్ మార్కెట్లో పెట్టుబడి పెట్టి తద్వారా వచ్చే గ్యారెంటీ లేని లాభాల నుంచి పెన్షన్ చెల్లించడమే 'నూతన పెన్షన్ విధానం'. ఈ విధానానికి మద్దతు పలకడం అంటే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల నుంచి ప్రతినెలా చందాగా వసూలు అయ్యే నిధులను ప్రైవేట్ పెట్టుబడిదారులకు ధారాదత్తం చేయడాన్ని సమర్థించడమే. అంతేకాదు ఈ వాస్తవాలను భయాలుగా చెప్తూ, అందుకు పరిష్కారంగా 'యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్' తెచ్చారంటూ పెట్టుబడిదారీ శక్తులకు జేపీ మద్దతు పలికారు. ఓపీఎస్ విధానం ద్వారా పెన్షన్ చెల్లిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ దివాలా తీస్తుందన్న పెద్దమనిషి, యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌లో 50% వేతనాన్ని గ్యారెంటీగా పెన్షన్‌గా చెల్లిస్తే ఆర్థిక పరిస్థితి తలకిందులు కాదా? మరి దాన్ని ఎట్లా సమర్థిస్తారు? పైగా తెలంగాణలో ఓపీఎస్ పునరుద్ధరించకుండా యూనిఫైడ్ పెన్షన్ పథకాన్ని అమలు చేయాలంటూ ఉచిత సలహా ఇస్తున్నారు. రాష్ట్రంలో పరిపాలన సంతృప్తికరంగా లేకపోవడానికి, పాఠశాల విద్య దిగజారడానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఓపీఎస్‌ను కోరడమే కారణమని చెప్పడానికి జేపీ తీవ్రంగా ప్రయత్నించినట్టు కనిపిస్తున్నది.

సామాన్య ప్రజల పన్నులపై మొసలి కన్నీరు కార్చే జేపీకి దేశాధినేతలు గుప్పెడు మంది పెట్టుబడిదారులైన 43 కార్పొరేట్ కంపెనీలకు రద్దు చేసిన రూ.3.53 లక్షల కోట్ల బ్యాంకు రుణాలు, లా ట్రిబ్యునల్ రద్దు చేసిన వేల కోట్ల రుణాలు కనిపించలేదా? కార్పొరేట్ సంస్థలకు ఏటా మాఫీ చేసే పన్నుల రాయితీలు చూడటంలేదా?

కాంట్రాక్టు పద్ధతుల్లో ఉద్యోగుల నియామకాల ద్వారా ఉద్యోగభద్రత లేకుండా పోయింది. టైమ్ స్కేల్ లేకుండా, పెన్షన్‌లేని పరిస్థితులను ప్రభుత్వాలు సృష్టిస్తున్నాయి. ఇటువంటి పరిణామాలను సూచించకుండా తెలివిగా ఉద్యోగులంతా ప్రభుత్వాల ఖజానాలోని సొమ్మును కాజేసే దొంగలు అన్నట్టుగా జేపీ చిత్రీకరిస్తున్నారు. నిజానికి నిత్యావసర ధరలు పెరుగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదే! ఆ బాధ్యత సక్రమంగా నిర్వహించలేని పరిస్థితుల్లో పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు సవరించాలనే డిమాండ్లు ఉద్యోగుల నుంచి సహజంగానే వస్తాయి. దాన్ని తప్పు అని జేపీ వాదిస్తున్నారు. ఉద్యోగులకు జీతాలు పెంచితే, ఇవ్వాల్సిన బకాయిలు ఇస్తే ప్రభుత్వాల ఆర్థిక వ్యవస్థ నడుము విరుగుతుందా? ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, అనుత్పాదక ప్రాజెక్టులు, అనవసర ఖర్చులు, అవినీతి వల్ల నడుము విరుగదా? ఇవన్నీ కూడా జేపీ చర్చించాలి కదా! మరి ఈ విషయాల్ని జేపీ ఎందుకు తెలివిగా దాటవేశారు? పాలనలో ప్రభుత్వ ఆదేశాలను అమలు చేసేది ఉద్యోగులే అయినప్పటికీ, కావలసిన ప్రణాళికలు రచించడం, అందుకు కావలసిన నిధులను, మౌలిక సదుపాయాలను సమకూర్చడం ప్రభుత్వ బాధ్యత. ఇవేవీ లేకుండా అన్ని అవకతవకలకు ఉద్యోగులు చేస్తున్న డిమాండ్లే కారణం అన్నట్టు జేపీ వాదించారు. దేశంలో, రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులకు, విధానాల అవకతవకలకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేస్తున్న డిమాండ్లే కారణమన్నట్టు జేపీ తన వ్యాసంలో వాదించారు.

# వినతులకు సత్వర పరిష్కారం చూపాలి

**– ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు**
**– పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటరావు**



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుంచి స్వీకరించే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఎస్.డీ.సీ పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే.వెంకట రావు సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా ఉపాధికల్పన అధికారి కే.శ్రీరామ్ తో కలిసి ప్రజల నుంచి వినతులు ఫిర్యాదులను స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలు రెవెన్యూ అంశాలు సంక్షేమ పథకాలు ఉపాధి పింఛన్లు గృహాలు మౌలిక వసతులు సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ముఖ్యమైన వేదికగా నిలుస్తోందన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం జాప్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఎలాంటి ఆలస్యం లేకుండా పరిష్కరించాలని క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు.ప్రజలు తమకు సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో వినతులు సమర్పించి స్థానిక స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం పొందాలని సూచించారు. వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. సంబంధిత అధికారులు ప్రజావాణిలో సమర్పించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వారి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# అమ్మ గొంతు

జీవితంలో ఓడిపోయి
తిరిగి ఇంటి గడప తొక్కినా,
"పర్వాలేదు? మళ్లీ ప్రయత్నించు"
అని ధైర్యం చెప్పేది అమ్మ గొంతు.
లోకం నీ ఓటమినివేలెత్తి చూపినా,
నీ గాయాలను చూసి మౌనంగా కన్నీరు
కార్చేది అమ్మ మనసు.
నువ్వు పడిపోయిన చోట లోకం నవ్వినా,
నీ చేయి పట్టుకునినిన్ను లేపేది అమ్మ చేయి.
నీ కలలు విరిగిపోయినానువ్వు మాత్రం
విరగకూడదని,
నీ కళ్లలో మళ్లీ ఆశ నింపేచివరి వెలుగు అమ్మే.
నీ అడుగులు తడబడితే"నడువు? నేనున్నాను"
అంటుంది,
నీ గుండె అలసిపోతే"ఆగకు? గెలుస్తావు" అంటుంది.
నీ ఓటమిని అపజయంగా కాదు
ఒక పాఠంగా చూస్తుంది,
నీ కన్నీటిని బలహీనతగా కాదు
రేపటి బలంగా మార్చుతుంది.
ప్రపంచం తలుపులు మూసినా
అమ్మ గడప ఎప్పుడూ తెరిచే ఉంటుంది,
ప్రపంచం నిన్ను వదిలినా
అమ్మ ఒడే నిన్ను చేరదీస్తుంది.
నీకు నువ్వే ఓడిపోయాననుకున్న వేళ
"నువ్వింకా ఓడిపోలేదు" అంటుంది,
నీ చివరి ఆశ కూడా ఆరిపోయిన వేళ
అమ్మ మాటే మరో దీపమవుతుంది.
జీవితం ఎన్ని పరీక్షలు పెట్టి నా
అమ్మ నమ్మకం నీకు కవచమవుతుంది,
నువ్వు ఎన్ని సార్లు పడిపోయినా



మళ్లీ లేచే ధైర్యం అమ్మే అవుతుంది.
ప్రపంచం ఇచ్చే విజయాలన్నింటికంటే
అమ్మ ఇచ్చే ధైర్యమే గొప్ప విజయం,
జీవితం ముగిసే వరకు
మన వెంటే నడిచే నిశ్శబ్ద దేవత అమ్మ.

**రచన : అందే శ్రీనివాస్**
**యస్.వి.ఆర్.స్కూలు కరెస్పాండెంట్, నెల్లూరు.**

# పేకాట రాయుళ్ల అరెస్టు

**దసరా పండుగ వేళ జూదానికి సిద్ధం**
**నాలుగు బైకులు,రూ.16,650 నగదు సీజ్**
**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్న సిఐ ఫణిందర్**

జ్యోతి ప్రభంజనం, నెక్కొండ;నెక్కొండ శివారులో పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం నెక్కొండ సీఐ ఫణిందర్ తన సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఈ దాడిలో గూగుల్ వెంకటేశ్వర్లు, పరకాల వెంకటరమణ, తాడేం రామచంద్రు, మూసిని శ్రీనివాస్, తేజవత్ మురళి, భూక్య ప్రతాప్ లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి నాలుగు ద్విచక్ర వాహనాలు, రూ. 16,650 స్వాధీనపరచుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ పోలీసులు ఏఎస్సై రవి, కానిస్టేబుల్ రాకేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంబంధాల వికృత స్వరూపం

రక్త సంబంధాలన్నీ ఆత్మీయతకు ఆలంబన కావు,
అనుబంధాలన్నీ అనురాగానికి ప్రతిరూపాలు కావు,
సంబంధం లేని మనుషులే సన్నిహితులవుతుంటే,



సొంత రక్తమే శత్రుత్వపు సర్పమై కాటేస్తోంది!
వరుసకు దగ్గరైన వారిలో వైరం విషమై ప్రవహిస్తుంటే,
వరసలేని పరాయివారిలో వాత్సల్యం విరబూస్తోంది,
కనిపించే బంధుత్వం కపటత్వానికి కవచమవుతుంటే,
కనిపించని అనుబంధం నిష్కల్మష ప్రేమకు నిలయమవుతోంది!
స్వార్థపు సంకెళ్లలో సొంతవాళ్లు బందీలవుతుంటే,
సహృదయపు సుగంధంతో పరాయివారు ప్రియులవుతున్నారు,
రక్తం పంచుకున్నంత మాత్రాన హృదయాలు కలవవు,
మనసు పంచుకున్నప్పుడే మనుషుల మధ్య మమతలు చిగురిస్తాయి!
ఆపదలో ఆదుకునేవాడే ఆత్మీయుడవుతాడు,
అవసరంలో అవమానించేవాడు బంధువైనా పరాయివాడే,
కష్టకాలంలో కరతలాన్ని అందించని కైవారం ఎందుకు?
కన్నీటి క్షణాల్లో కరుణ చూపని బాంధవ్యం ఎందుకు?
బంధుత్వపు ముసుగులో బాణాలు సంధించే వారికంటే,
పరిచయం లేని పథికుడి పలకరింపే మిన్నవుతుంది,
పదవులు, ఆస్తులు, అంతస్తులు బంధాలను నిలపలేవు,
పరస్పర గౌరవమే అనుబంధాలకు ప్రాణప్రదమవుతుంది!
అందుకే మనిషిని బంధుత్వంతో బేరీజు వేయకు,
అతని అంతరంగంలోని ఔదార్యాన్ని ఆవిష్కరించి చూడు,
ఎందుకంటే రక్తంతో ఏర్పడేది కేవలం బంధుత్వం,
హృదయంతో ఏర్పడేదే జన్మజన్మల ఆత్మీయత్వం!

**రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

# మనిషి మిగిల్చే గాయం

వ్యసనాలకు అలవాటు పడినా ఎలాగోలా బయటపడగలం,



కానీ ఒక మనిషికి అలవాటు పడితే మనల్ని మనమే కోల్పోతాం!
ప్రతిరోజూ పలకరించే మాటకు మనసు బానిసైపోతుంది,
క్షణక్షణం వినిపించే గొంతు కోసం గుండె నిరీక్షణలో కరిగిపోతుంది!
ఒక్కరోజు కనిపించకపోతే వేల ఆలోచనలు చుట్టుముడతాయి,
ఒక్కమాట మాట్లాడకపోతే వంద ప్రశ్నలు గుండెను తొలిచేస్తాయి!
అలవాటైన మనిషి దూరమైతే అంతా శూన్యంగా కనిపిస్తుంది,
నవ్వుతూ తిరిగే పెదవుల వెనుక నిశ్శబ్దపు యుద్ధం మొదలవుతుంది!
వ్యసనం శరీరాన్ని బంధిస్తే మనిషిపై ప్రేమ మనసును బంధిస్తుంది,
వ్యసనాన్ని వదిలే మార్గం దొరకొచ్చు మనిషిని మరిచే దారి దొరకదు!
మాటలు ఆగిపోయినా జ్ఞాపకాలు ఆగవు,
బంధాలు తెగిపోయినా భావాలు చావవు,
దూరాలు పెరిగిపోయినా ఆశలు చావవు,
కాలం గడిచినా గాయాలు మానవు!
అందుకే మనసిచ్చే ముందే ఆలోచించాలి,
మనిషిని ప్రేమించాలి.. కానీ మన ఉనికిని మనమే మరిచిపోకూడదు!

**రచన : ఆర్.కె.రెడ్డి**
**గోగులపల్లి, నెల్లూరు జిల్లా.**

# నీటి నిల్వ పెంపునకు తక్షణ చర్యలు చేపట్టాలి

**– మూడు జిల్లాల తాగునీటి అవసరాల కోసం నీటిని పొదుపుగా వినియోగించాలి**
**– సీతమ్మసాగర్ ప్రాజెక్టు పనులు నవంబర్ నుంచి ప్రారంభించేలా సన్నద్ధం కావాలి**
**– నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలి**
**– వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ పెంపునకు తక్షణ చర్యలు చెప్పటడంతో పాటుగా మూడు జిల్లాల తాగునీటి అవసరాల కోసం నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామ పరిధిలోని దుమ్ముగూడెం ఆనకట్టను రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్ చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. రానున్న వేసవిలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆనకట్ట వద్ద నీటి నిల్వను పెంచేందుకు చేపట్టాల్సిన తక్షణ చర్యలను అధికారులతో సమీక్షించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. దుమ్ముగూడెం ఆనకట్ట పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 0.8 టీఎంసీలు కాగా ప్రస్తుతం సుమారు 0.5 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. గోదావరి నదిలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుకూలమైన పరిస్థితులు పరిమితంగా ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని వృథా కాకుండా నిల్వ చేసుకోవడం అత్యంత ముఖ్యమన్నారు. దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి మూడు జిల్లాలకు తాగునీరు అందించాల్సి ఉన్నందున రానున్న నెలల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులకు కారణమవుతున్న సూపర్ ఎల్‌నినో భూతం ప్రభావంతో రానున్న కాలంలో తీవ్రంగా ఉండే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని దక్షిణ భారతదేశంలో వర్షపాతంపై కూడా ప్రభావం పడుతుందని తెలిపారు. ఇప్పటికే ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రానున్న వేసవిలో నీటి లభ్యతపై ఆందోళన నెలకొందన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ జలవనరులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రానున్న వేసవిలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని దీంతో విద్యుత్ వినియోగం డిమాండ్ కూడా పెరిగి విద్యుత్ కొరత ఏర్పడే పరిస్థితులు తలెత్తవచ్చని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని అన్నారు. రానున్న వేసవిలో విద్యుత్ కొరత తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకుని నీరు విద్యుత్ వనరుల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద సుమారు ఒక మీటరు ఎత్తు వరకు ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి నీటిని నిల్వ చేసుకునే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి సూచించినట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులు వెంటనే పనులు ప్రారంభించాలని విజయదశమి పండుగ రోజైనా పనులకు ఆటంకం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఇసుక బస్తాల ఏర్పాటు ద్వారా సాధ్యమైనంత ఎక్కువ నీటిని నిల్వ చేసుకునేలా ఇంజినీరింగ్ అధికారులు సాంకేతిక అంశాలను పరిశీలించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. నీటి ప్రవాహం తగ్గకముందే పనులు పూర్తి చేసి నీటిని నిల్వ చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ చర్యల ద్వారా ఒక టీఎంసీ కంటే ఎక్కువ నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటే రానున్న నెలల్లో మరింత కాలం తాగునీటి అవసరాలను తీర్చవచ్చని తెలిపారు. ఆనకట్ట వద్ద నీటి నిల్వ పెంపు చర్యలతో పాటు నీటి వినియోగాన్ని కూడా నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి అధికారులకు సూచించారు. సమీపంలోని ప్రైవేటు జలవిద్యుత్ కేంద్రానికి నీటి వినియోగం విషయంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆనకట్టలో తగినంత నీటి నిల్వ ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. తాగునీటి అవసరాలకు సరిపడా నీరు నిల్వ ఉన్నప్పుడు అదనంగా ప్రవహించే మిగులు నీటిని మాత్రమే ఇతర అవసరాలకు వినియోగించేలా సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. తాగునీటి అవసరాలకు సరిపడా నీరు అందుబాటులో లేని పరిస్థితుల్లో ఇతర అవసరాలకు నీటి వినియోగాన్ని నియంత్రించాలని స్పష్టం చేశారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మాణంపై మంత్రి మాట్లాడుతూ వివిధ అనుమతులు న్యాయపరమైన అడ్డంకుల కారణంగా గత ఐదేళ్లుగా ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రాజెక్టుకు అవసరమైన అనుమతుల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోందని అన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు ద్వారా సంబంధిత న్యాయపరమైన అంశాల్లో పురోగతి సాధించామని, ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఈ నెలలో లభించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నిర్మాణానికి అవసరమైన యంత్రాలు సామగ్రి సిబ్బంది ఇతర వనరుల సమీకరణపై ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత నిర్మాణ సంస్థకు సూచించారు. నవంబర్ నుంచి ప్రాజెక్టు పనులు ప్రారంభించేలా జిల్లా యంత్రాంగం నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రాజెక్టు పనుల ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసుకోవడం ద్వారా అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపట్టేందుకు వీలవుతుందని అన్నారు. రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. పంటల సాగుకు ఎకరానికి లక్ష నుంచి రెండు మూడు లక్షల రూపాయల వరకు పెట్టుబడి అవసరమవుతున్న నేపథ్యంలో పంట చేతికొచ్చే సమయంలో నీరు విద్యుత్ భూగర్భ జలాల కొరత ఏర్పడితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల సాగుకు ముందే నీటి లభ్యత విద్యుత్ సరఫరా భూగర్భ జలాల పరిస్థితులను అంచనా వేసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. తక్కువ వ్యవధిలో దిగుబడి ఆదాయం వచ్చే కూరగాయలు పప్పుదినుసులు వంటి పంటలను అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా సాగు చేయాలని మంత్రి సూచించారు. ఒకటి లేదా రెండు తడులతో పంట చేతికి వచ్చే అవకాశాలను పరిశీలించాలని అధిక నీరు అవసరమయ్యే పంటల సాగు విషయంలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. నీటి లభ్యతపై స్పష్టత లేకుండా అధిక పెట్టుబడులతో పంటలు సాగుచేసి నష్టపోవడం కంటే అందుబాటులో ఉన్న వనరులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం మంచిదని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై సూచనలు అందించాలని ఆదేశించారు. ప్రజలు కూడా తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా కాపాడుకోవడంతో పాటు భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. జిల్లా యంత్రాంగం నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ పెంపు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, సంబంధిత శాఖల అధికారులు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





# బతుకమ్మ చీరలు ఎక్కడ

**బతుకమ్మ పండుగ వేళ ఆడపడుచులకు నిరాశే**
**చీరలు పంపిణీ చేయకుండా మహిళలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం**
**నెక్కొండ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంగని సూరయ్య,**

జ్యోతి ప్రభంజనం,నెక్కొండ, అక్టోబర్ 19:తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడపడుచులకు బతుకమ్మ చీరలు అందించకపోవడంపై నెక్కొండ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంగని సూరయ్య కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ప్రశ్నించారు. ఏటా బతుకమ్మ పండుగ సందర్భంగా చీరలు అందుతాయని ఆశించిన మహిళలకు ఈసారి నిరాశ ఎదురైందని, పండుగ ముగిసినా చీరల పంపిణీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం విచారకరమని విమర్శించారు. బతుకమ్మ పండుగ అంటే తెలంగాణ ఆడపడుచులకు ఎంతో ప్రత్యేకం. అలాంటి పండుగ వేళ మహిళలకు చీరలు అందించకపోవడం వెనుక ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో ప్రజలకు వివరించాలని సంగని సూరయ్య డిమాండ్ చేశారు. మండలంలో చీరల పంపిణీ ఎక్కడనర్సంపేట నియోజకవర్గంలోని నెక్కొండ మండలంలో బతుకమ్మ చీరల పంపిణీ జరగకపోవడంపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా చీరల పంపిణీపై స్పష్టత లేకపోవడంతో మహిళలు ఎదురుచూసే పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో బతుకమ్మ పండుగ సందర్భంగా చీరల పంపిణీ ఒక సంప్రదాయంగా కొనసాగిందని, ఇప్పుడు ఆ కార్యక్రమం ఎందుకు నిలిచిపోయిందో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీల పేరుతో హామీలు.. మహిళలకు నిరాశేనాఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ, మహిళా సంక్షేమంలో ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని సంగని సూరయ్య కోరారు. పండుగల సందర్భంగా మహిళలకు అందాల్సిన ప్రయోజనాలపై ముందుగానే స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, మహిళా సంక్షేమ పథకాల పురోగతిపై ప్రభుత్వం వివరాలు వెల్లడించాలని, బతుకమ్మ చీరల పంపిణీని నిలిపివేసి ఉంటే అందుకు గల కారణాలను అధికారికంగా ప్రకటించాలని అన్నారు. బతుకమ్మ పండుగకు ప్రాధాన్యత ఏదితెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రభుత్వం కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా, మహిళల సంక్షేమానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని పండుగ ముగిసిన తర్వాత కూడా చీరల పంపిణీపై స్పష్టత లేకపోవడం మహిళల్లో అసంతృప్తికి కారణం ప్రభుత్వమే అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలిబతుకమ్మ చీరల పంపిణీపై ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే వెల్లడించాలని సంగని సూరయ్య డిమాండ్ చేశారు. ఈసారి చీరల పంపిణీ ఎందుకు జరగలేదు? భవిష్యత్తులో పంపిణీ చేపట్టే ఆలోచన ఉందా? మహిళలకు ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుంది? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కోరారు. అలాగే తెలంగాణ ఆడపడుచులకు ఇచ్చిన హామీలను విస్మరించకుండా, మహిళా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలనీ డిమాండ్ చేశారు.




# దుర్గామాత అమ్మవారిని దర్శించుకున్న సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్





అబ్దుల్లాపూర్ మెట్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 19:అబ్దుల్లాపూర్ గ్రామ యువత ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారిని గ్రామ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్ గారు దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజలందరూసుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో సర్పంచ్ పాల్గొని, గ్రామ మహిళలు, ప్రజలతో కలిసి పండుగ సంబరాల్లో పాల్గొనారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకుబతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంతటి సుష్మా అశోక్ గౌడ్ మరియు పాలకవర్గ సభ్యులు తోర్పునూరి శివ గౌడ్. గడ్డమీది దశరథ గౌడ్ మాచగొని మహేందర్ ముదిరాజ్. మరియు నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది

# సైదాబాద్ రత్నదీప్-3లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

సైదాబాద్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 19: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను వ్రరన్కరించుకుని సైదాబాద్‌లోని రత్నదీప్?3లో మహిళలు ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు చేరి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. పండుగ వాతావరణంతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని సంప్రదాయాలను చాటిచెప్పారు. పూల పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకలు మహిళల్లో ఆనందాన్ని నింపడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని మరోసారి చాటిచెప్పాయి. ఈ కార్యక్రమంలో రాపోలు రేణుక, మమత, శ్రీవాణి, వెన్నెల, లలిత, సుజాత, నవనిత, భవాని, పూజ,సంధ్య,వీరస్వామి, కళ్యాణ్, రోహిత్,తదితరులు, పాల్గొన్నారు.





# శ్రీశ్రీశ్రీ నాభిశిల బొడ్రాయి ప్రథమ వార్షిక మహోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ.

ఎల్ బీ నగర్,జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 19:హయత్ నగర్‌లోని అయ్యప్ప దేవాలయంలో శ్రీశ్రీశ్రీ నాభిశిల బొడ్రాయి ప్రథమ వార్షిక మహోత్సవాల ఆహ్వాన శుభ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గారు పాల్గొన్నారు.మన గ్రామ సంస్కృతి, సంప్రదాయాలకు బొడ్రాయి ఒక ప్రతీక.తెలంగాణ గ్రామీణ సంప్రదాయాల్లో బొడ్రాయికి విశిష్టమైన స్థానం ఉంది. గ్రామానికి కేంద్ర బిందువుగా బొడ్రాయిని భావిస్తూ, గ్రామ ప్రజల ఐక్యతకు, ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా పూజిస్తారు. గ్రామ క్షేమం, ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని కోరుకుంటూ బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించడం మన పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయం.బొడ్రాయి పూజలు, వార్షిక మహోత్సవాలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలే కాకుండా గ్రామ ప్రజలందరినీ ఒకచోట చేర్చి, పరస్పర స్నేహభావాన్ని, ఐక్యతను పెంపొందించే వేడుకలు. మన పూర్వీకులు అందించిన ఆచార సంప్రదాయాలను భావితరాలకు అందించడం, మన సంస్కృతీ వైభవాన్ని కాపాడుకోవడం ఇలాంటి ఉత్సవాల ముఖ్య ఉద్దేశం.ఈ నేపథ్యంలో 2026 అక్టోబర్




31 మరియు నవంబర్ 1 తేదీలలో నిర్వహించనున్న శ్రీశ్రీశ్రీ నాభి శిల బొడ్రాయి ప్రథమ వార్షిక మహోత్సవాలు విజయవంతం కావాలని కళ్లెం నవజీవన్ రెడ్డి గారు ఆకాంక్షించారు. ఈ మహోత్సవాల్లో భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.గ్రామ ప్రజలందరికీ శ్రీశ్రీశ్రీ నాభి శిల బొడ్రాయి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# బతుకమ్మ చీరలు ఎక్కడ

**అన్ని పథకాల మాదిరిగానే దీన్ని కూడా అటకెక్కించారా**
**రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సిపిఐ ధనుంజయ నాయుడు**

సూర్యాపేట, జ్యోతి ప్రభంజనం,సద్దుల బతుకమ్మ పండుగతో బతుకమ్మ పండుగ పూర్తవుతుందని ఇంతవరకు బతుకమ్మ చీరలు పంపిణీ చేయలేదని ఇంకెప్పుడూ చేస్తారని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు ఆదివారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల లో సిపిఐ కార్యాలయం ప్రజా భవన్ నుంచి పాత్రికేయులతో మాట్లాడుతూ.... 2017 సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా



తెలంగాణ మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం మొదలు పెట్టిందని ఆనాటి నుంచి 2023 వరకు సుమారు ఏడు సంవత్సరాల పాటు నిరాటంకంగా ఆ ప్రక్రియ కొనసాగిందని 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం ఒక్కసారి మాత్రమే చీరల పంపిణీ చేశారని గత రెండు సంవత్సరాలుగా బతుకమ్మ చీరల పంపిణీ జరగలేదని గత కొంతకాలంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రానున్న దసరాకు సొంత ఆడపడుచులు ఇంటికి వస్తే ఎలాంటి మంచి చీర పెడతామో అలాంటి చీరలే తెలంగాణ మహిళలకు అందిస్తామని పాలిస్టర్ చీరలు అందించబోమని కాటన్ చీరలు అందిస్తామని ఎంతో ఆర్భాటంగా ప్రకటించి ఉన్నారని పైగా ఈ సంవత్సరం రెండు చీరలు పంపిణీ చేస్తామని ప్రకటించారని కానీ ఒక్క చీర కూడా పంపిణీ చేయలేదని ఇప్పటికైనా మించి పోయింది లేదని ఈ రెండు రోజుల్లో చీరల పంపిణీ చేయాలని ఆయన కోరారు చీరల ఖరీదు ఎంత అన్నది ముఖ్యం కాదని రాష్ట్ర ప్రభుత్వం తమకు పండుగ సందర్భంగా చీరలు అందించారని మహిళలు సంతోషపడతారని ఇవాళ వారికి ఆ సంతోషాన్ని దూరం చేయడం తగదని, అన్ని పథకాల మాదిరిగానే ఈ పథకాన్ని కూడా అటకెక్కించారా అని ఆయన ప్రశ్నించారు తెలంగాణ ప్రజలకు ఎంతో గొప్ప పండుగ దసరా అని ఈ దసరాకు చేయూత పెన్షన్లు కూడా అందించలేదని ఒకపక్క చీరలు ఇవ్వకుండా మరో పక్క దివ్యాంగులకు,వితంతువులకు వృద్ధులకు ఇచ్చే పెన్షన్లు కూడా ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఇది ప్రభుత్వానికి అంత క్షేమకరం కాదని ఆయన హితవు పలికారు ఆయన వెంట బీసీ హక్కుల సాధన సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు చిలకరాజు శ్రీను సహాయ కార్యదర్శి కొమ్రాజు వెంకట్ ఏఐటియుసి మండల అధ్యక్షుడు ఊదర వెంకన్న ఏఐవైఎఫ్ మండలాధ్యక్షుడు పరికె భరత్, బత్తిని శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

# మీడియా ముసుగులో వసూళ్లకు అడ్డుకట్ట వేయాలి!

**డిప్యూటీ తహసీల్దార్ ఆత్మహత్య ఘటనపై నిష్పాక్షిక విచారణకు విజ్ఞప్తి**
**బాధ్యులుగా తేలిన రిపోర్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి**
**తెలంగాణ ప్రభుత్వాన్ని కోరిన తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం**



అమరావతి, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 19:మీడియా పేరుతో అధికారులను, వ్యాపారులను బెదిరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మేడవరపు రంగనాయకులు తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. పాల్వంచ డిప్యూటీ తహసీల్దార్ ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన రిపోర్టర్లపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవినీతి, అక్రమాలను వెలికితీయాల్సిన మీడియా.. వాటిని ప్రోత్సహించే సాధనంగా మారడం బాధాకరమన్నారు. కొద్దిమంది అనైతిక చర్యలకు మొత్తం మీడియా వ్యవస్థను, నిజాయితీగా పనిచేసే జర్నలిస్టులను నిందించడం సరికాదని స్పష్టం చేశారు. మీడియా గుర్తింపును అడ్డుపెట్టుకుని బెదిరింపులు, వసూళ్లకు పాల్పడేవారిపై సంబంధిత యాజమాన్యాలు, అధికారులు దృష్టి సారించాలని సూచించారు. మీడియా రంగంలో వృత్తిపరమైన అర్హతలు, నైతిక విలువలు, జవాబుదారీతనం పెంపొందించేందుకు జర్నలిస్టు సంఘాలు, మీడియా యాజమాన్యాలు, ప్రభుత్వం కలిసి స్వయం నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. ఇలాంటి చర్యలు కొనసాగితే మీడియాపై ప్రజల విశ్వసనీయత దెబ్బతింటుందని హెచ్చరించారు.“వసూళ్లకు వేదిక కాదు మీడియా.. విలువలకు నిలయం కావాలి! ప్రజలను, బాధితులను ఆదుకోవడానికి ముందుకు రండి. బ్రతికించడానికి రండి.. బ్రతుకుదెరువుకు మీడియాను అడ్డుపెట్టుకోవద్దు” అని మేడవరపు రంగనాయకులు హితవు పలికారు.

# తూర్పుగూడెం లో ఘనం గా సద్దుల బతుకమ్మ వేడుకలు



తుంగతుర్తి: 19 అక్టోబర్ 2026: తుంగతుర్తి మండలం తూర్పుగూడెం గ్రామం లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మలతో గుంపుగా బజార్ల నుండి కొత్త బట్టలు కట్టుకుని, నగలు వేసుకుని అందంగా ముస్తాబై తూర్పుగూడెం చెరువు కట్టపై బతుకమ్మలు బృందాలుగా పెట్టుకుని డీజే పాటలకు స్టెప్ లు వేస్తూ?అలసట లేకుండా సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఆడుకుని పడుకున్నారు. గ్రామ ఆడబిడ్డలు పెద్ద సంఖ్యలో తమ పుట్టినూర్లో బతుకమ్మ పండుగను ఆనందం గా జరుపు కున్నారు. సంవత్సరం మొత్తం సరిపోయే ఈ ఆనంద క్షణాలను తమ తల్లిగారింట్లో-పుట్టిన వూళ్లో జరుపుకుని తిరిగి తమ మెట్టినూరికి వెళ్లి జీవితాన్ని గడుపడానికి సంసిద్ధ మవుతున్నారు. తమ చిన్న నాటి స్నేహితులు,బంధువులు, గ్రామస్థులు,ఆడుకున్న,చదువుకున్న



ప్రదేశాలను తిరిగి ఒకసారి చూసుకుని మనసుల్లో పదిల పరుచుకున్నారు. మళ్లీ బతికుంటే మళ్లీ మళ్లీ తమ పుట్టింటికి-పుట్టిన ఊరికి రావాలని కోరుకున్నారు.ఈ సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలో గ్రామ స్త్రీలతో పాటు వారి ఆనందం లో పాలు పంచుకోవడానికి-రక్షణ కల్పించడానికి గ్రామ పురుషులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను ఆనందంగా జరుపుకున్నారు. ఈ వేడుకలో హిందుస్థాన్ సమ సమాజ్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు హజారి మాలతీ శ్రీనివాస్ రావు, సూర్యాపేట జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ గుజ్జ దీపిక యుగంధర్ రావు, తక్కెళ్లపల్లి సంధ్య రాణి రవీందర్ రావు, స్వర్ణ లత, శ్రీ లత ఇతర మహిళలు, పురుషులు పాల్గొన్నారు.

# శ్రీ మహిషాసుర మర్ధనీ దేవిఅలంకరణలో అమ్మవారు

**- పెద్దమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు**
**- అమ్మవారిని దర్శించుకున్న భక్తజనం**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం): శ్రీ దేవి శరన్నవరాత్రుల మహోత్సవ కార్యక్రమాలలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైటర్ బస్తి ఏరియా సింగరేణి సెంట్రల్ వర్క్ షాప్ ఆవరణలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. దసరా ఉత్సవాలలో భాగంగా సోమవారం శ్రీ మహిషాసుర మర్ధనీ దేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. పూజలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నా రు. కుంకుమార్చన కూడా జరిగింది. ఆల య ప్రధాన అర్చకులు ఎల్ వి త్యాగరాజ శర్మ, అర్చకులు ఎల్వి పవన్ శర్మలు గోత్ర నామాలు చదివిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



# సద్దుల బతుకమ్మ లో బహుమతులు అందించిన లైన్స్ క్లబ్ అధ్యక్షులు తల్లాడ కేదారి..

తుంగతుర్తి అక్టోబర్ 19.తుంగతుర్తి పట్టణంలో సద్దుల బతుకమ్మను గ్రామ ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు లాస్ట్ బతుకమ్మ సద్దుల పండుగ రోజున ఘనంగా వైభవంగా మహిళలు రంగురంగుల పూలతో రంగురంగుల బట్టలతో అలంకరించుకొని వారు సద్దుల బతుకమ్మను జరుపుకుంటున్నారు అట్టి బతుకమ్మలో పెద్ద ఎత్తున రంగురంగుల పూలతో అలంకరించిన వారి కి బహుమతులను లైన్స్ క్లబ్ వారు బహుమతులు ప్రకటించారు ఫస్ట్ ఒకరికి అంబటి రేణుక .గోపగాని వనజ.సువర్ణ .ఓరుగంటి స్రవంతి. కాసనకోట శోభ. జావాజీ అనిత. దేవాలయ అర్చకులు. స్వాతి.రామయ్య గా రూ. పలువురు గ్రామ మహిళలు సద్దుల బతుకమ్మను చెరువులో కి వదిలారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ప్రతినిధులు వెంకటనారాయణ గౌడ్, శోభ వెంకన్న




పప్పుల వెంకన్న గుజ్జ భాస్కర్ ఓరుగంటి సుభాష్ శ్రీనివాస్ గణేష్ ఉప సర్పంచ్ శ్రీనివాస్ పలువురు లైన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

printed and published by **Rapolu Lingaswamy**,onbehalf of printed at **SMILYS ONLINE** 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana **Editor: Rapolu Lingaswamy.pone:9908103501,** PRGI **NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com**